సాక్షి వికారాబాద్

బుధవారం । 25 । జనవరి । 2023



హాజరు పడదు.. కూలి అందదు!

ఉపాధి కూలీల హాజరులో కొత్త విధానం గందరగోళం రేపుతుంది. సాంకేతిక సమస్య నీడలా వెంటాడుతోంది. 8లో ▸



గ్రామాలకు ప్రత్యేక నిధులు

గ్రామ పంచాయతీల అనుబంధ గ్రామాలకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే ఆనంద్ తెలిపారు. 8లో ▸



రెండేళ్లయినా..

గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సౌకర్యం సరిగా లేక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. 9లో ▸

న్యూస్‌రీల్

ఎమ్మెల్యేను కలిసిన మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్



ఎమ్మెల్యే ఆనంద్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ప్రిన్సిపాల్ నాగమణి

అనంతగిరి: వికారాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్. కె.నాగమణి మంగళవారం ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాల విషయాలపై చర్చించారు.

నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించండి

జిల్లా వ్యవసాయాధికారి గోపాల్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి గోపాల్

కొడంగల్ రూరల్ : రైతులకు నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు అందించాలని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ సూచించారు. మంగళవారం పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల్లోని ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణదారుల (డీలర్ల)తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ లైసెన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా రైతులకు కావాల్సిన సరుకులను అందించాలని తెలిపారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసే సమయంలో ఆధార్‌కార్డు కచ్చితంగా తీసుకొచ్చేలా డీలర్లు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ శంకర్‌రాథోడ్, కొడంగల్ ఏఓ బాలాజీప్రసాద్, దౌల్తాబాద్ ఏఓ లావణ్య, బొంరాస్‌పేట ఏఓ పద్మావతి, ఆయా మండలాల ఏఈఓలు, డీలర్లు పాల్గొన్నారు.

తైక్వాండోలో బంగారు పతకం



బంగారు పతకంతో ధనశ్రీ పవార్

బంట్వారం: తైక్వాండో నేషనల్ ఛాంపియన్‌షిప్- 2023 పోటీల్లో గిరిజన విద్యార్థిని బంగారు పతకం సాధించింది. మండల పరిధిలోని నాగవరం తండాకు చెందిన ధనశ్రీ పవార్ 8వ తరగతి చదువుతోంది. ఇటీవల తమిళనాడలో నిర్వహించిన క్యాడెట్ సబ్ జూనియర్ నేషనల్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ అండర్-47 కేజీలో సత్తాచాటారు. ఈ నెల 21న ఇండియా తైక్వాండో వారి చేతుల మీదుగా ధనశ్రీ బంగారు పతకం అందుకుని, ఇంటర్నేషనల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు శంకర్ పవార్, మనీష, నాగవరం తండా వాసులు సంతోషం వ్యక్తం చేశారు.

చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన



చిరుధాన్యాల బ్యానర్‌ను ఆవిష్కరించిన ఏడీఏ తదితరులు

మోమిన్‌పేట్: చిరుధాన్యాలలో పిండిపదార్థాలు, ప్రొటీన్లు, ఇనుము, మెగ్నీషియం, కాల్షియం, పీచుపదార్థాలు వంటి పోషకాలు అధికంగా ఉంటాయని ఏడీఏ వినోద్‌కుమార్ తెలిపారు. రైతులు యాసంగి సీజన్‌లో చిరుధాన్యాల సాగుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. వ్యవసాయశాఖ అధ్వర్యంలో మండల కేంద్రంలో మంగళవారం చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చిరుధాన్యాలు రక్తంలోని కొవ్వు శాతాన్ని తగ్గిస్తాయని అన్నారు. రక్తపోటుతో బాధపడేవారికి ఇది మంచి ఆహారమని అన్నారు. రోగ నిరోధకశక్తిని పెంపొందించడంలో, బరువు తగ్గించడంలో, రక్తంలో కొలెస్ట్రాల్ శాతం అదుపులో ఉండటానికి ఇవి సహాయపడతాయని అన్నారు. మోమిన్‌పేట్ పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ యాసంగి సీజన్‌లో రైతులు కొర్రలు, సజ్జలు, రాగులు, అరికెలు, ఉలువలు, సామలు లాంటి చిరుధాన్యలను సాగుచేయాలని రైతులకు సూచించారు. తక్కువ ఖర్చుతో అధిక లాభాలు ఆర్జించవచ్చని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి జయశంకర్, ఏఓ సంధ్య, ఏఈఓలు పెంటయ్య, మౌనిక, శ్రీనివాసులు, మనీషా, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

శివసాగరం కబ్జా



శివసాగర్ ప్రాజెక్టు నీటిలో అక్రమంగా వేసిన ఫెన్సింగ్

పై ఫొటోలో కనిపిస్తున్నది శివసాగర్ ప్రాజెక్టు (చెరువు). వికారాబాద్ పట్టణానికి దశాబ్దాల కాలంగా నీరందిస్తోంది. హైదరాబాద్‌కు చెందిన కొందరు ప్రైవేటు వ్యక్తులు ప్రాజెక్టులో నీరు నిలిచే ప్రాంతాన్ని సైతం కబ్జా చేశారు. ఇందులో ఫాంహౌస్‌ల నిర్మాణం చేపట్టడమేకాకుండా బీటీ రోడ్లు సైతం వేశారు. గతంలో జిల్లాలో విధులు నిర్వహించిన ఓ ఉన్నతాధికారి చెరువులో ఉన్న పొలాన్ని నిబంధనలకు విరుద్ధంగా తమ బంధువులకు ధారదత్తం చేశారనే ఆరోపణలున్నాయి. ఇందుకోసం రికార్డులు సైతం తారుమారు చేసినట్టు సమాచారం. హైదరాబాద్‌కు వెళ్లే దారిలో ఇరువైపులా విస్తరించి ఉన్న ఈ చెరువు భూమి కబ్జా చేసినట్టు స్పష్టంగా కనిపిస్తున్నా ప్రస్తుత అధికారులు సైతం స్పందించకపోవడం గమనార్హం.

యథేచ్ఛగా ఆక్రమణలు

- రియల్టర్ల ఇష్టారాజ్యం
- కుచించుకుపోతున్న చెరువు ప్రాంతం
- ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య పర్సెంటేజీల వ్యవహారం
- జిల్లా కేంద్రానికి దశాబ్దాలుగా నీరు అందిస్తున్న ప్రాజెక్టు

వికారాబాద్: మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఏదైనా సమస్య ఏర్పడితే జిల్లా కేంద్రానికి, వికారాబాద్ మున్సిపాలిటీకి తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఉన్న ఏకైక ప్రత్యామ్నాయం శివసాగర్ మాత్రమే. 2.25 క్యూబిక్ మిలియన్ లీటర్ల సామర్థ్యం కాగా, నిరంతరంగా వాడితే కొద్ది రోజుల్లోనే చెరువు మొత్తం అడుగంటే అవకాశం ఉంది. ఈ చెరువు రోజుకోచోట కబ్జాలకు గురవుతున్నా అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు. శివసాగర్‌కు ఒకవైపే కాకుండా దశాబ్దం కాలంగా నాలుగు వైపులా కబ్జాలకు గురవుతోంది. కొందరు బడా బాబులు ఈ చెరువును కబ్జా చేసి ఫాం హౌస్‌లు నిర్మిస్తుండగా మరికొందరు చెరువు చివరి భాగాల్లో పూడ్చేసి ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారు. సుమారు 65వేల జనాభా కలిగిన వికారాబాద్ పట్టణానికి ప్రధాన ఆధారమైన ఈ చెరువును రియల్టర్లు, బడా బాబులు అన్ని వైపులా దిగ్బంధనం చేస్తుండటంతో చెరువు రోజురోజుకు కుచించుకుపోతోంది. రక్షించాల్సిన మున్సిపల్ అధికారులు చూసిచూడనట్టు వ్యవహరిస్తున్నారు.

అందరూ పాత్రధారులే..

చెరువు కబ్జా కోరల్లో చిక్కుకోవటంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు ఇలా అందరు పాత్రధారులుగా మారుతున్నారు. నియోజకవర్గ ముఖ్య నేతల కనుసన్నల్లోనే ఈ చెరువును కబ్జా చేస్తూ వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెరువుతో పాటు ఆ చుట్టూ ఉన్న అసైన్డ్ భూములు సైతం కబ్జా చేసి వెంచర్లలో కలుపుకొంటున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో అధికారులతో పాటు ముఖ్య నేతల హస్తం కూడా ఉండటంవల్లే కబ్జాలకు అడ్డుకట్ట పడటం లేదని స్పష్టమవుతోంది. చెరువును కబ్జా చేస్తూ కోట్ల రూపాయలు సంపాదిస్తున్న రియల్టర్లు, కబ్జాదారులు నేతలకు, అధికారులు పర్సెంటేజీలు ఇస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తమ జేబులు నింపుకొంటున్న అధికారులు, నేతలు.. పట్టణవాసులకు నీరందించే చెరువు దుస్థితిని మాత్రం పట్టించుకోవటంలేదు. ఎవరికి ఎంత పర్సెంటేజీ అనే విషయం ముందుగానే మాట్లాడుకుని రంగంలోకి దిగుతుండటంతో అడ్డూఅదుపు లేకుండా కబ్జాలు కొనసాగుతున్నాయని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఫైవ్‌మెన్ కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారమే నిర్మాణాలు, వెంచర్లకు అనుమతులు ఇస్తారని, అలాంటి దాన్ని తామేమి చేసేది ఉండదని వికారాబాద్ మున్సిపల్ కమిషనర్ సమస్యను దాటవేస్తుండటం గమనార్హం.



మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేకే వదిలేశాం

- తాండూరులో అనిశ్చితిని వారిద్దరే సరిదిద్దుతారు
- నిష్పక్షపాతంగా ఉపాధ్యాయుల బదిలీలు
- విద్యార్థుల వార్షిక పరీక్షలకు ఇబ్బందులు రానివ్వం
- మరోసారి మహేశ్వరం నుంచే పోటీ చేస్తా
- విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి

తాండూరు: నియోజవర్గంలోని బీఆర్‌ఎస్ పార్టీలో నెలకొన్న అనిశ్చితిని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలే సరిదిద్దుకొంటారని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. మంగళవారం పుట్టినిల్లయిన తాండూరు మండలం కోట బాస్పల్లిలో జరిగిన ఎల్లమ్మ దేవత ఉత్సవాలకు హాజరయ్యారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో నెలకొన్న వర్గపోరుకు దిద్దుబాటు చర్యలు చేపడుతున్నారా అన్న ప్రశ్నకు మంత్రి బదులిచ్చారు. ఇద్దరు నేతలకు ఎవరు చెప్పే అవసరం లేదని వారే చూసుకొంటారని అన్నారు. తాను ఈసారి కూడా మహేశ్వరం నుంచే ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని అన్నారు. చేవెళ్ల నుంచి ఎంపీగా రంజిత్‌రెడ్డి పోటీ చేస్తారని అన్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీ చేస్తే ఇతర రాష్ట్రాల్లో కూడా పార్టీ ప్రచార బాధ్యతలు స్వీకరిస్తానని అన్నారు. విద్యాశాఖ చేపడుతున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు నిష్పక్షపాతంగా సాగుతాయన్నారు. ఉమ్మడి జిల్లాలో 26వేల మంది ఉపాధ్యాయులు ఉన్నారని అన్నారు. తొలి విడతలో 10 వేల మందికి పదోన్నతులు కల్పిస్తామన్నారు. అందుకోసం బదిలీ, పదోన్నతుల ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్ ద్వారానే జరుగుతుందన్నారు. వార్షిక పరీక్షల సమయంలో విద్యార్థుల బోధనకు ఆటంకం లేకుండా ప్రక్రియ కొనసాగుతుందన్నారు. మరోవైపు భార్యాభర్తలుగా ఉన్న ఉపాధ్యాయులు ఒకే జిల్లాలో బదిలీ చేసేందుకు సీఎం కేసీఆర్ సానుకూలంగా ఉన్నారన్నారు. అయితే ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు కొంత సమయం పడుతోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు మన ఊరు- మన బడి కార్యక్రమం కార్యక్రమంలో తొలి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 9వేల పాఠశాలలను ఎంపిక చేశామన్నారు. అయితే ఇప్పటి వరకు 1200 పాఠశాలల్లో పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. పూర్తిచేసిన వాటిని వారం రోజుల్లో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, మాజీ జెడ్పీటీసీ మాధవరెడ్డి, నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, పట్లోళ్ల నర్సింహులు, శ్రీనివాసచారి, గుర్రంపల్లి రాందాస్ తదితరులున్నారు.

మనబడి పనులు వేగిరం చేయండి



తొర్మామిడి సర్పంచ్ స్ఫూర్తితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

- అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ
- పలు పాఠశాలల సందర్శన

బంట్వారం: మనఊరు- మనబడి కింద పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. మంగళవారం ఆయన బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లోని తొర్మామిడి, అన్నాసాగర్ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులను పరిశీలించారు. జాప్యం జరగకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలంటూ అధికారులకు సూచించారు. పెండింగ్ పనులు లేకుండా చూడాలన్నారు. మిగతా పాఠశాలల్లో కూడా వెంటనే పనులు ప్రారంభించాలని తెలిపారు. సకాలంలో పూర్తి చేస్తే విద్యార్థులకు మౌలిక వసతులు సమకూరుతాయన్నారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ జితేందర్ రెడ్డి, ఎంపీడీఓ బాలయ్య, ఏఈ చాణక్యరెడ్డి , పంచాయతీ కార్యదర్శి స్వప్న, సర్పంచ్ స్ఫూర్తి తదితరులు పాల్గొన్నారు.

ధారూరులో తనిఖీ..

ధారూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం మన బడి పనులను అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ పరిశీలించారు. పనుల్లో నాణ్యతపై ఆరా తీశారు. హెచ్ఎం అంజిలయ్యతో మాట్లాడుతూ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పనుల్లో తీవ్ర జాప్యం లేకుండా చూడాలన్నారు. 2ఇసుక అందుబాటులో లేకపోవడంతో పనుల్లో జాప్యం జరుగుతోందని కాంట్రాక్టర్ హఫీజ్ అదనపు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించి మన బడి పనులకు ఇసుక పర్మిట్లు ఇవ్వాలని ఆయన పెద్దేముల్ తహసీల్దార్‌కు ఫోన్‌లో ఆదేశించారు. అదనపు కలెక్టర్ వెంట గ్రామ సర్పంచ్ చంద్రమౌళి, అధికారులు తదితరులు ఉన్నారు.

బాలల హక్కులపై అవగాహన అవసరం

బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యుడు అంజన్‌రావు

ఇబ్రహీంపట్నం రూరల్: బాలల హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యుడు అంజన్‌రావు సూచించారు. ఆదిబట్ల మున్సిపాలిటీ బొంగ్లూర్ ఆదర్శ పాఠశాలను జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావుతో కలిసి ఆయన తనిఖీ చేశారు. తరగతి గదులు పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. జీవించే హక్కు, రక్షణపొందే హక్కు, భాగస్వామ్య హక్కుల గురించి తెలుసుకోవాలన్నారు. చైల్డ్ హెల్ప్‌లైన్ నంబరు 1098ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఈఓ ప్రవీణ్, మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ లావణ్య, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అంజన్‌రావు

లాభాల్లో పరిగి డిపో ముందంజ



పరిగి బస్టాండ్‌లో స్టాల్‌ను పరిశీలిస్తున్న ఈడీ పురుషోత్తం

- కేఎంపీఎస్‌లో రాష్ట్రంలోనే మొదటి స్థానం
- ఆర్టీసీ ఈడీ పురుషోత్తం వెల్లడి

పరిగి: రాష్ట్రంలోనే పరిగి డిపో లాభాల్లో ముందంజలో ఉందని ఈడీ పురుషోత్తం తెలిపారు. మంగళవారం ఆయన పరిగి డిపోను సందర్శించారు. బస్టాండ్ పరిసరాలను పరిశీలించి ప్రయాణికులకు పలు బస్సుల వేళలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిపోలో ఉత్తమ సేవలు అందిస్తున్న సిబ్బందిని సన్మానించి ప్రశంస పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిగి డిపో రూ.2.45కోట్ల లాభాల్లో ఉందని, సిబ్బంది సహకారం వల్లే ఇది సాధ్యమైందన్నారు. కేఎంపీఎల్‌లో రాష్ట్రంలోనే పరిగి డిపో మొదటి స్థానంలో ఉందని అన్నారు. డిపో సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఆర్టీసీ మొత్తం 1016 బస్సులను కొనుగోలు చేసిందని అందులో 551 ఎలక్ట్రికల్ బస్సులు కొనుగోలు చేశామన్నారు. రంగారెడ్డి రీజియన్‌కు 31 బస్సులు వచ్చాయని వాటిని డిపోలకు త్వరలోనే కేటాయిస్తామన్నారు. పరిగి డిపో నుంచి త్వరలోనే తిరుపతికి సూపర్ లగ్జరీ బస్సు సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ఆర్టీసీ వల్ల ఎలాంటి లాభాలు ఉన్నాయో గ్రామీణులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రయాణికులే దైవంగా ముందుకు సాగాలని, ప్రయాణికులను సురక్షితంగా గమ్యాన్ని చేరవేసేది ఆర్టీసీ బస్సులేనని, కార్గో, అన్ని రకాల శుభకార్యాలకు బస్సుల సౌకర్యాల గురించి ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పరిగి డిపో మేనేజర్ పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మార్కండేయ జయంతి

వికారాబాద్ పట్టణ సమీపంలోని అనంతగిరి గుట్టలో వెలిసిన మార్కండేయ ఆలయంలో మంగళవారం జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాల్లో అభిషేకం, అర్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం సామూహిక భజన కార్యక్రమం చేపట్టారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

– అనంతగిరి



ప్రత్యేక అలంకరణలో మార్కండేయ స్వామి



ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

అభ్యర్థుల వేట!

- బలమైన నేతల వైపు.. బీజేపీ చూపు
- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నుంచి వచ్చే వారిపై నజర్
- పార్టీలో చేరిన బడా నేతలంతా గప్‌చుప్
- స్థాయికి తగిన ప్రభావం చూపని వైనం
- క్యాండెట్లు ఎవరో ఇప్పటికీ స్పష్టత కరువు

వికారాబాద్: జిల్లాలో పోటీ చేసే అభ్యర్థుల కోసం కమలం పార్టీ కసరత్తు చేస్తోంది. ఒక్క వికారాబాద్‌లో మినహా బలమైన కేండెట్లు లేకపోవటం ఇబ్బందికరంగా మారింది. తాండూరు, పరిగి, కొడంగల్‌లో ఎవరిని బరిలో దింపాలనే అంశంపై అంతర్గత చర్చ మొదలైంది. ఇటీవల రాష్ట్రంలో జరిగిన పలు ఎన్నికల్లో ప్రభావితమైన వ్యక్తులను నిలబెట్టిన కాషాయ పార్టీ ఆ మేరకు మిశ్రమ ఫలితాలు రాబట్టగలిగింది. ఇదిలా ఉండగా గడిచిన ఏడాది కాలంగా జిల్లాలో 'బీజేపీ ఆకర్ష్' పేరుతో పలువురిని పార్టీలోకి చేర్చుకున్నప్పటికీ పెద్దగా ఫలితం లేకుండా పోయింది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తూ వస్తున్న నేతలకు దీటైన ప్రత్యర్థులు బీజేపీకి దొరకడం లేదు. ఎమ్మెల్యేగా, మంత్రిగా సుదీర్ఘకాలం పాటు జిల్లా రాజకీయాల్లో కీలక భూమిక పోషించిన ఎ.చంద్రశేఖర్ ప్రస్తుతం పెద్దగా ప్రభావం చూపడం లేదు. తన సొంత నియోజకవర్గమైన వికారాబాద్‌లోనూ పార్టీ తరఫున చురుకైన పాత్ర పోషించడంలో విఫలమవుతున్నారనే విమర్శలున్నాయి.

అనేకమంది ఆశావహులు

బీజేపీకి రాష్ట్ర స్థాయిలో వస్తున్న ఆదరణను చూసి జిల్లాలో అనేక మంది కొత్త నేతలు వచ్చి పార్టీలో చేరుతున్నారు. ఇప్పటికే దశాబ్దాల కాలంగా కమలదళంలో పని చేస్తున్న వారు సైతం ప్రస్తుతం పార్టీకి వస్తున్న ఆదరణను అందిపుచ్చుకోవాలని భావిస్తున్నారు. ఇలా కొత్త, పాత నేతల కలయికతో నియోజకవర్గాల్లో ఆశావహుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. అత్యధికంగా పరిగి నియోజకవర్గం తరఫున పోటీ చేసేందుకు పలువరు నేతలు ఉవ్విళ్లూరుతున్నారు. ఇప్పటికే స్థానికంగా ఉన్న ప్రహ్లాద్‌రావు, అడపాదడపా వచ్చి వెళ్తున్న పరమేశ్వర్‌రెడ్డి, కిరణ్ తదితరులు ఇక్కడి నుంచి టికెట్ ఆశిస్తున్నారు. ఇంకా పార్టీలో చేరనప్పటికీ కేఎస్‌ఆర్ ట్రస్టు చైర్మన్ శరత్‌రెడ్డి సైతం బీజేపీ నుంచి పరిగి టికెట్ ఆశిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇక కొడంగల్ నుంచి పూనంచంద్ లావోరీ, తాండూరు నుంచి రమేశ్, మురళీకృష్ణగౌడ్, నరేష్ తదితరులు టికెట్ రేసులో ఉన్నట్లు సమాచారం. వికారాబాద్‌లో ఏసీఆర్ రూపంలో బలమైన అభ్యర్థి ఉండగా ఆయన మాత్రం స్థాయికి తగిన ప్రభావం చూపడం లేదు. తాండూరు, పరిగి, కొడంగల్‌లో పార్టీ అభ్యర్థుల కోసం ఇతర పార్టీలకు చెందిన ముఖ్య నేతలను సంప్రదిస్తున్నట్లు తెలుస్తోంది.



కనిపించని ఊపు

సోషల్ మీడియాతో పాటు ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలతో తరచూ వార్తల్లో ఉంటున్న బీజేపీకి క్షేత్రస్థాయిలో ఆ ఊపు కనిపించడం లేదు. ఈ విషయంలో జిల్లా నేతలు దారుణంగా విఫలమవుతున్నారనే ఆరోపణలున్నాయి. ఏ.చంద్రశేఖర్ మొదలుకుని విఠల్, మురళీకృష్ణగౌడ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వంటి నేతలు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. పరమేశ్వర్‌రెడ్డి, కిరణ్ వంటి నేతలు సైతం కొంత హల్‌చల్ చేస్తున్నా క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం దిశగా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించడం లేదు. పార్టీలో చేరింది మొదలు ముఖ్య నేతలు సైతం కేడర్‌ను పెంచుకునేందుకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. దీంతో జిల్లాలో వీరి చేరిక అనంతరం ఎలాంటి ప్రభావం కనిపించటంలేదు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఇకనైనా పార్టీలో చేరిన నేతలు క్రియాశీలకంగా పనిచేయాలని కార్యకర్తలు, అభిమానులు డిమాండ్ చేస్తున్నారు.

క్లుప్తంగా

రేపటి నుంచి 'హాథ్ సే హాథ్ జోడో'



కొడంగల్: పీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డి ఈ నెల 26, 27 తేదీల్లో కొడంగల్ నియోజకవర్గంలో పర్యటిస్తారని ఆయన వ్యక్తిగత సిబ్బంది మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 26న మధ్యాహ్నం 12గంటలకు బొంరాస్‌పేట మండలం మదన్‌పల్లిలో 'హాథ్ సే హాథ్ జోడో' కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. అనంతరం బొంరాస్‌పేట మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశమౌతారు. మధ్యాహ్నం 3గంటలకు దుద్యాల మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం, సాయంత్రం 5గంటలకు కొడంగల్ మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తారు. 27న ఉదయం 10గంటలకు దౌల్తాబాద్ మండల నాయకులు, కార్యకర్తలు, 11గంటలకు మద్దూరులో, 12గంటలకు కొత్తపల్లిలో మధ్యాహ్నం 12గంటలకు కొత్తపల్లిలో మధ్యాహ్నం ఒంటిగంటకు గుండుమాల్‌లో, మధ్యాహ్నం 3గంటలకు కోస్గిలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. ఈ యాత్రలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

28న రథ సప్తమి



కొడంగల్: పట్టణంలోని బాలాజీనగర్‌లో వెలిసిన పద్మావతీ సమేత మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 28న రథ సప్తమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు, అర్చకులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దేవేరుల సమేత శ్రీనివాసుడు ఏడు వాహనాలపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. సూర్యప్రభ, శేష, గరుడ, హనుమంత, ముత్యాల పందిరి, సర్వభూపాల, చంద్రప్రభ వాహనాలపై స్వామి వారు మాడ వీధుల్లో తిరుగుతూ భక్తులకు దర్శనం ఇస్తారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని ధర్మకర్తలు కోరారు.

హాజరు పడదు.. కూలి అందదు

ఉపాధి కూలీలకు డబ్బులు అందక ఇబ్బంది పడుతున్నారు. ప్రతీ వారం రావాల్సిన కూలి డబ్బులు నెల రోజులు గడిచినా చేతికందడం లేదు. దీంతో వస్తాయో.. రావోనని వారు ఆందోళన చెందుతున్నారు. అవకతవకలు అరికట్టేందుకు తీసుకువచ్చిన ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో సర్వర్ సతాయిస్తుండడంతో హాజరు పడడం లేదు... వేతనం అందడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కూలి డబ్బులు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- సర్వర్‌లో సాంకేతిక సమస్యలు
- సతమతమవుతున్న ఉపాధి కూలీలు



దౌల్తాబాద్: ఉపాధి కూలీల హాజరులో కొత్త విధానం గందరగోళం రేపుతుంది. నిత్యం సర్వర్‌లో హాజరు నమోదు చేయాల్సి ఉండగా సాంకేతిక సమస్య నీడలా వెంటాడుతోంది. సర్వర్ సతాయిస్తుండడంతో హాజరు పడడంలేదు. రోజంతా శ్రమించినా కూలి డబ్బులకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. ఇది వరకు రాతపూర్వకంగా వేసే హాజరు స్థానంలో ఎన్‌ఎంఎంఎస్(నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం) యాప్ తీసుకువచ్చారు. ఈ ఏడాది అమలు చేస్తున్నారు.

అక్రమాలకు చెక్

ఉపాధి పనుల్లో పారదర్శకత కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఎంఎంఎస్ యాప్ తీసుకువచ్చింది. పాత విధానంలో లొసుగులను ఆసరా చేసుకుని కొందరు సిబ్బంది ఇష్టానుసారంగా వివరాలు నమోదు చేశారు. కూలీలు రాకున్నా వచ్చినట్లు వేయడం, పనులు కాకున్నా పూర్తి చేసినట్లు చూపడం, కొలతల్లో తేడాలు వంటివి సామాజిక తనిఖీల్లో బహిర్గతమయ్యాయి. దీంతో కొత్త యాప్ ద్వారా కూలీల చిత్రాలను వారు పనిచేసే చోటే తీసి అంతర్జాలంలో పొందుపరుస్తున్నారు. ఉదయం, సాయంత్రం హాజరు నమోదు చేయాలి. ఒక వేళ ఆన్‌లైన్‌లో ఒక్కపూట హాజరు వేయకున్నా ఆ రోజు డబ్బులు రావు. జవాబుదారీగా నిలవాలని తీసుకువచ్చినా నూతన విధానం కూలీలకు తలనొప్పిగా మారింది.

అప్‌లోడ్ చేస్తేనే హాజరు

యాప్‌లో తరచూ సర్వర్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఉదయం హాజరు పడితే సాయంత్రం పడడం లేదు. సిగ్నల్స్ అందక సమస్య తీవ్రమవుతోందని క్షేత్రసహాయకులు వాపోతున్నారు. ఇది వరకు ఒక వర్క్ ఐడీ కింద పని చేస్తున్న కూలీల సంఖ్య 20 దాటితే సామూహిక చిత్రం నమోదు చేసేవారు. ఇప్పుడు ఒక్కో వర్క్ ఐడీ కింద ఒక్కొక్కరికి చిత్రం అప్‌లోడ్ చేయాలి. అంతేకాకుండా ఒక కూలీ మొదటి హాజరును నమోదు చేసిన నాలుగు గంటల తర్వాతే రెండో హాజరు తీసుకోవాలి. లేదంటే తీసుకోదు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా వేయి మంది ఉపాధి పనులకు హాజరవుతున్నారు. వేసవిలో మూడు నెలలు నిత్యం ఆరు వేల మందికి పైగా పనులలకు హాజరవుతారు. ఇంత మంది హాజరు నమోదు చేసుకోవడం క్షేత్ర సహాయకులకు ఇబ్బందే. కొందరు ఉదయం పనులకు వచ్చి సాయంత్రం రావడంలేదు. వారు డబ్బులు పోగొట్టుకుంటున్నామనే విషయం వారికి తెలియడంలేదు.

వెక్కిరిస్తున్న సిబ్బంది కొరత

కూలీల హాజరు నమోదు ప్రస్తుతం క్షేత్ర సహాయకులు మేట్లు చూస్తున్నారు. మండలంలో 33 గ్రామ పంచాయతీలుండగా 13 మంది క్షేత్రసహాయకులు పనిచేస్తున్నారు. వారికి సహాయకంగా మరికొందరు మేట్లు ఉన్నారు. ప్రస్తుతం తక్కువగా కూలీలు పనులకు వస్తున్నా హాజరు నమోదు సవాల్‌గా మారింది. ఇక ఎక్కువ మంది ఉన్నప్పుడు ఏం చేస్తారో చూడాలి. ప్రస్తుతం ఒక గ్రామంలో 20 పనులు పూర్తి చేసిన తర్వాతే కొత్తవి ప్రారంభించేలా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. దీంతో ఇప్పటికప్పుడు ఇబ్బంది లేకున్నా వేసవిలో కూలీలకు పూర్తి స్థాయిలో పనులు కల్పించడానికి వీలు లేకుండా పోయే అవకాశం ఉంది. కాగా కూలీల హాజరు నమోదులో ఇబ్బందులు ఎదురవుతున్న మాట వాస్తవమేనని ఉపాధి అధికారులు చెబుతున్నారు. సర్వర్ సమస్యతో హాజరు నమోదు చేయలేకపోతున్నామని పలువురు క్షేత్రసహాయకులు తమ దృష్టికి తెచ్చారని వివరించారు. కూలీలకు రెండు పూటలా హాజరు నమోదైతేనే డబ్బులు వస్తాయి. ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

పదోతరగతి విద్యార్థులకు కోచింగ్

డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి

దోమ: ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు మండల కేంద్రాల్లో ఉచిత కోచింగ్ ఏర్పాటు చేస్తామని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ఎంపీపీ అనసూయతో కలిసి మండల పరిధిలోని పరిధిలోని బొంపల్లి, మోత్కూర్, బడేంపల్లి, ఐనాపూర్, దోమ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బీఎమ్మార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు తల్లిదండ్రుల కలలను నెరవేర్చేందుకు ఇప్పటి నుంచే శ్రద్ధగా చదవాలన్నారు. మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తామని ప్రకటించారు. పేద విద్యార్థులకు ఇబ్బంది పడకూడదనే ఫౌండేషన్ ద్వారా మెటీరియల్స్ అందజేస్తున్నామన్నారు. విద్యార్థుల పైచదువులకు అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు అనితగౌడ్, విజయ, నర్సింహులు, జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ యాదయ్యగౌడ్, ఎంఈఓ హరిశ్చందర్, సర్పంచ్ మల్లేశ్, ఉప సర్పంచ్‌లు శ్రీకాంత్‌రావు, బుగ్గయ్య, ప్రధానోపాధ్యాయులు హరిలాల్, పురందాస్, రామకృష్ణ, నర్సింహులు, ఉపాధ్యాయులు, బీఆర్‌ఎస్ నాయకులు రాఘవేందర్‌రెడ్డి, రమేశ్, శ్రీనివాస్, పవన్‌యాదవ్, రాజేశ్ యాదవ్, హైమద్, జనార్దన్ గౌడ్, శివకుమార్‌గౌడ్, వసంతరావు, నాయకులు రియాజ్, లోకేశ్‌యాదవ్, ప్రవీణ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



బొంపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి

గిరిజన ఉపాధ్యాయులకు న్యాయం చేయండి

మంత్రి సబితారెడ్డిని కోరిన విఠల్‌నాయక్

తాండూరు రూరల్: రాష్ట్రంలో నిర్వహించే ఉపాధ్యాయ బదిలీల్లో గిరిజన ఉపాధ్యాయులకు 10శాతం రిజర్వేషన్లు కల్పించాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విఠల్‌నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం కోటబాసుపల్లికి వచ్చిన విద్యాశాఖ మంత్రి సబితారెడ్డిని గోర్ బంజార వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విఠల్ నాయక్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఎస్టీలకు 10శాతం రిజర్వేషన్లు కల్పించడంపై గోర్ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 27నుంచి జరిగే ప్రమోషన్లలో జీఓ 33 ప్రకారం 10శాతం ఎస్టీలకు అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రకాశ్ రాథోడ్, లక్ష్మణ్ నాయక్, మోహన్ నాయక్, వినోద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న విఠల్‌నాయక్, గోర్ బంజార వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

ఘనంగా మార్కండేయ జయంతి



ఉత్సవాల్లో పాల్గొన్న బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ తదితరులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని శివారెడ్డిపేటలో మంగళవారం మార్కండేయ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే స్వామివారికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం హోమం నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్, మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ మార్కండేయ ముని అనంతగిరి అడవుల్లో తపస్సు చేశారని చరిత్ర చెబుతోందన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

అనుబంధ గ్రామాలకు ప్రత్యేక నిధులు

'మీతో–నేను'లో ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్

మర్పల్లి: గ్రామ పంచాయతీల అనుబంధ గ్రామాలకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తామని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని బూచన్‌పల్లి జాజుగుబ్బడి తండా, కొత్లాపూర్ అనుబంధ గ్రామం అల్లాపూర్, పట్లూర్ అనుంబంధ గ్రామం కట్టెపహాడ్ తండాల్లో జెడ్పీటీసీ సభ్యుడు మధుకర్‌తో కలిసి మీతో–నేను కార్యక్రమం చేపట్టారు. ముందుగా ఆయా గ్రామాల్లో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయాగ్రామాల సర్పంచ్‌ల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనుబంధ గ్రామాల్లో అవసరమైన మేర సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా సక్రమంగా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయా శాఖ అధికారులను ఆదేశించారు. బూచన్‌పల్లి జాజుగుబ్బడి తండాలో వ్యవసాయ పొలాల వద్ద వేలాడుతున్న విద్యుత్ తీగలను సరి చేయాలని, రోడ్లపై మురుగు పారకుండా మురుగు కాల్వలు నిర్మించి సీసీ రోడ్లు వేయాలన్నారు. ఇందుకు బూచన్‌పల్లికి రూ.4లక్షలు, జాజుగుబ్బడి తండాకు రూ.4లక్షలు మంజూరు చేశారు. ఇక అల్లాపూర్ గ్రామానికి లోటల్టేజీ నివారించేందుకు ఓ కొత్త ట్రాన్స్‌ఫారం ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో అధికారులకు ఆదేశించాడు. మిషన్ భగీరథ లికేజీలను సరిచేసి నీరు సరపరా చేసేలా చూడాలని మిషన్ భగీరథ అధికారులను ఆయన ఆదేశించాడు. ఆయా గ్రామాల్లో లబ్ధిదారులకు పింఛన్స్ వస్తున్నాయా? ఎవరికైనా పింఛన్ అందడం లేదా తదితర విషయాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నాడు. అనుబంధ గ్రామాల్లో షెడ్యూల్ ప్రకారం శానిటేజన్ పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించాడు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

అనంతరం అనారోగ్యంతో సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్న బాధితులకు మంజూరైన చెక్కులను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులందరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జయదయాకర్, ఇందిర అశోక్, జెడ్పీటీసీ సభ్యుడు మధూకర్, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు సోయేల్ షరీఫ్, రైతు బంధు మండల అధ్యక్షుడు నాయబ్‌గౌడ్, మార్కెట్ డైరెక్టర్ గౌస్, సహకార సంఘం డైరెక్టర్ యాదయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాచయ్య, ఉపాధ్యాక్షుడు అశోక్, రమేష్‌మిత్ర, మండల యూత్ ప్రెసిడెంట్ మధూకర్, ఆయా శాఖల అధికారులు, బీఆర్‌ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.



జాజుగుబ్బడి తండాలో తాగునీటి బావిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు తదితరులు

వివాహిత అదృశ్యం



రిజ్వాన(ఫైల్)

కుల్కచర్ల: కుటుంబంలో తలెత్తిన మనస్పర్థల కారణంగా ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైంది. ఈ ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గిరి ప్రకారం... మండల కేంద్రానికి చెందిన శ్రీధర్ ప్రసాద్‌కు హైదరాబాద్ వాసి రిజ్వాన(శ్రావ్య)తో ఎనిమిదేళ్ల క్రితం ప్రేమ వివాహమైంది. కాగా పదిరోజుల క్రితం శ్రీధర్ తల్లికి ఆరోగ్యం బాగోలేదని కుల్కచర్లకు వచ్చారు. ఈ క్రమంలో చెందిన రిజ్వాన(శ్రావ్య) 23న 11గంటల సమయంలో కుమారుడు నానిని బాగా చూసుకో అని భర్తకు ఎస్‌ఎంఎస్ చేసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఫోన్ స్విచ్ఛాప్ వస్తుండడంతో శ్రీధర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్



పత్రాలు పరిశీలిస్తున్న ఆడిటర్లు, ఎఫ్‌ఏలు

బంట్వారం: ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించిన సోషల్ ఆడిట్ బంట్వారం మండలంలో ఈ నెల 26నుంచి నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఆడిట్ బృందం మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో కలిసి గ్రామాల వారీగా పత్రాలు పరిశీలించారు. నవంబర్ 2020 సంవత్సరం నుంచి ఫిబ్రవరి 2022 వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్ నిర్వహిస్తారు.

పశుమిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించండి

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ, పశువైద్య శాఖలో పని చేస్తున్న పశుమిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ కోరారు. ఈ మేరకు మంగళవారం అడిషనల్ కలెక్టర్ తిరుపతిరావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రమోహన్‌తోపాటు జిల్లా ఉపాధ్యక్షుడు అలువాల రవికుమార్ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 2,500 మంది పశుమిత్రలు ఎనిమిదేళ్లుగా పని చేస్తున్నారని అన్నారు. ఎలాంటి పారితోషకాలు ఇవ్వకుండా వారితో పని చేయించుకుంటున్నారని విమర్శించారు. వెట్టి చాకిరీ నుంచి విముక్తి కల్పించి జీవో 60 ప్రకారం కనీస వేతనాలు అందజేయాలని, ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, టీఏ, డీఏలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు పద్మ, మానస, సంగీత, మౌనిక, సరస్వతి, అనురాధ, లావణ్య, ఉమ, యాదమ్మ, పావని తదితరులు పాల్గొన్నారు.

రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శివకుమార్

కొడంగల్: ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శివకుమార్, తాలూకా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బస్వరాజ్, తాలూకా బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు భీంరాజ్ మంగళవారం రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సురేశ్‌కు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థులకు ప్రభుత్వం రెండేళ్లుగా ఫీజులను చెల్లించడం లేదన్నారు. రూ.3వేల కోట్ల ఫీజు బకాయిలు ఉన్నాయన్నారు. కళాశాల విద్యార్థులకు సంవత్సరానికి రూ.20వేలు స్కాలర్‌షిప్ ఇవ్వాలన్నారు. ఇంటర్ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను రూ.1800నుంచి రూ.15వేలకు, మెస్ ఛార్జీలను రూ.3వేలకు పెంచాలన్నారు. బీసీ జనాభా ప్రాతిపదికన 240 బీసీ గురుకులాలు, 50 డిగ్రీ కళాశాలలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ కళాశాలలు, గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకుడు చంద్రశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దార్ సురేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బాలికలు ఉన్నతంగా రాణించాలి

ఎంఈఓ హరిశ్చందర్

పరిగి: బాలికలు అన్ని రంగాల్లో ఉన్నతంగా రాణించాలని మండల విద్యాధికారి హరిశ్చందర్ సూచించారు. మంగళవారం పట్టణ కేంద్రంలో బాలికల ఉన్నత పాఠశాలలో బాలిక సాధికారత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి సమాజంలో బాలికలపై ఎన్నో అఘాయిత్యాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బాలికల అక్రమ రవాణ, బాలికల ఈవ్‌టీజింగ్, బాల్యవివాహాలు విద్యాభివృద్ధిపై అంశాలపై విద్యార్థులతో చర్చించారు. ప్రతీ ఒక్క విద్యార్థి అన్ని రంగాలపై అవగాహన పెంచుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాలకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ హరిశ్చందర్

డ్వాక్రా సంఘాల పనితీరు భేష్

ఐడీబీఐ బ్యాంకు అధికారుల బృందం

యాచారం: ప్రభుత్వాల ఆర్థిక సహకారంతో డ్వాక్రా సంఘాలు వ్యక్తిగత ఆర్థికాభివృద్ధి సాధించడం బాగుందని వివిధ రాష్ట్రాలకు చెందిన ఐడీబీఐ బ్యాంకు అధికారుల బృందం పేర్కొంది. ఇక్కడి మహిళల స్వయం కృషిని తమ తమ రాష్ట్రాల్లోని మహిళలకు తెలియజేసి వారిని చైతన్యపరుస్తామని తెలిపారు. మహారాష్ట్ర, రాజస్థాన్, పశ్చిమబెంగాల్, తమిళనాడు తదితర రాష్ట్రాలకు చెందిన 35 మంది బ్యాంకు అధికారుల బృందం మంగళవారం నల్లవెల్లి గ్రామంలో పర్యటించింది. డ్వాక్రా సంఘాల సభ్యులతో సమావేశమై ప్రభుత్వ రుణాల ద్వారా లబ్ధి పొందుతున్న తీరుపై అధ్యయనం చేసింది. రుణాలు పొందే పద్ధతి, చెల్లింపులు, సంఘం సమావేశాలు, వ్యక్తిగత ఆర్థికాభివృద్ధి, రికార్డుల నమోదు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. డ్వాక్రా సంఘాల మహిళలు బ్యాంకుల ద్వారా రుణాలు పొంది వివిధ దుకాణాలు, చిరు వ్యాపారులు ఏర్పాటు చేసుకుని ఆర్థిక ప్రగతి సాధిస్తున్న తీరు, తమ పిల్లలను చదివిస్తున్న తీరు తెలుసుకొని అభినందించారు. అనంతరం మండల కేంద్రంలో మహిళా సమాఖ్య భవనంలో డ్వాక్రా సంఘాలతో సమావేశం నిర్వహించారు. మహిళలు లబ్ధి పొందుతున్న తీరుపై ఎంపీపీ కొప్పు సుకన్య బ్యాంక్ అధికారులకు వివరించారు. ఐడీబీఐ బ్యాంకు డిప్యూటీ జీఎం బుచ్చిబాబు, డిప్యూటీ మేనేజర్ భాస్కర్, డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ జంగారెడ్డి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు బాల్‌రాజ్, స్వర్ణలత, నర్సింహ, మండల ఏపీఎం సతీష్, వివిధ గ్రామాల సీసీలు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ పర్యటనకు వెళ్లిన బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జ్ తరుణ్‌చుగ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ తిరుగు ప్రయాణంలో మంగళవారం రాత్రి షాద్‌నగర్ బైపాస్‌లో ఆగారు. అక్కడ చాయ్ తాగి బీజేపీ నేతలతో ముచ్చటించారు. స్థానిక నేతలు వారిని సన్మానించారు. అనంతరం తరుణ్‌చుగ్, బండి సంజయ్ హైదరాబాద్‌కు వెళ్లిపోయారు.



బీజేపీ దేశానికి చేసిందేమిటో చెప్పాలి

- మతాల పేరుతో తగాదాలు పెడుతున్నారు
- పేదరికం, నిరుద్యోగం పెరిగిపోతోంది
- సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా

మీర్‌పేట: ప్రజల మధ్య మతాల పేరుతో గొడవలు పెట్టడం తప్ప బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలకు చేసిందేమిటని సీపీఐ జాతీయ కార్యదర్శి, రాజ్యసభ మాజీ సభ్యులు అజీజ్‌పాషా ప్రశ్నించారు. మీర్‌పేట లెనిన్‌నగర్‌లో సీపీఐ మండల సమితి కార్యాలయాన్ని మంగళవారం మాజీ ఎమ్మెల్యే, సీపీఐ జాతీయ నాయకులు పల్లా వెంకట్‌రెడ్డి, పల్లా నర్సింహారెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశ ఆర్థిక పరిస్థితి దిగజారడంతోపాటు నిత్యావసర ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే దేశం అధోగతి పాలవుతుందని, కావున ప్రజలంతా ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గతంలో మీర్‌పేట ప్రాంతంలో ప్రధాన పార్టీలంతా కలిసి ఒక అభ్యర్థిని నిలబడితే, సీపీఐ మాత్రం ఒక దళిత యువకున్ని పోటీలో ఉంచిందని, అతనికి ప్రజలు పట్టం కట్టారని గుర్తు చేశారు. ఈ ప్రాంతంలోని కొందరు సీపీఐ నాయకులు వారి స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీని వీడారని, అయినా కార్యకర్తలు, అభిమానులు పార్టీ వెంటే ఉన్నారని తెలిపారు. భవిష్యత్తులో మీర్‌పేటలో పార్టీకి పూర్వ వైభవం వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బాలాపూర్ మండలంలో సీపీఐ పేదల కోసం ఎన్నో పోరాటాలు చేసిందని, ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు. పేద ప్రజలకు అందుబాటులో కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రజలకు ఏ అవసరం, ఆపద వచ్చినా ముందుండాలని ఆయన నాయకులకు సూచించారు. మండల కార్యదర్శి అయోధ్య వెంకటరమణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాల్‌రాజ్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ రవీంద్రాచారి, సభ్యులు పానుగంటి పర్వతాలు, శ్రామిక మహిళా సంఘం జాతీయ ఉపాధ్యక్షులు కమలాకర్‌రెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బీ చంద్రయ్య, దత్తు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అజీజ్ పాషా

కాన్హాలో లాలాజీ మహరాజ్ జయంతి ఉత్సవాలు

నేటి నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు

నందిగామ: మండల పరిధిలోని కాన్హా హార్ట్‌ఫుల్‌నెస్ కేంద్రం (రామచంద్ర మిషన్)లోని ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన కేంద్రంలో బుధవారం నుంచి లాలాజీ మహరాజ్ 150వ జయంతి ఉత్సవాలను ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే నెల 3వ తేదీ వరకు 8 మంది ప్రముఖుల ఆధ్వర్యంలో మ్యూజికల్ ఫెస్టివెల్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాలకు ప్రపంచంలోని సుమారు 120 దేశాలకు చెందిన అభ్యాసీలు హాజరయ్యే అవకాశం ఉందని పీఆర్‌ఓ చంద్రారెడ్డి చెప్పారు.వారి కోసం హైదరాబాద్, సికింద్రాబాద్‌కు చెందిన అన్ని డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుస్తాయని, తిమ్మాపూర్, షాద్‌నగర్ రైల్వే స్టేషన్ల నుంచి ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.